



"ఏంలేపేవు తట్టారి తలుపు?" ఇంట్లోకి అడుగు పెడుతూనే శ్రీమతి కాంతం మీద చికాకు పడ్డాడు చంద్రం.

రెండుమైళ్ళ దూరంలో ఉన్న ఆఫీసు నుంచి రెండు కాళ్ళ బండి మీద ప్రయాణం చేసొచ్చాక కాపురం చేస్తున్న కొంప ముందు అరగంటసేపు తలుపు మీద చెయ్యినొప్పెట్టేలా బాదుతూ నించోటం బాధాకరమైన విషయమే మరి! ఆయన గారు ముఖం చిట్లించటం సబబే!

"మధ్యాహ్నం అంతా తల పోటుగా ఉండి కాస్త పడుకున్నాను. ఇప్పుడే కళ్ళు మూతపడ్డాయి. ఒక్క నిముషం ఆలస్యానికే అలా విసుక్కు పడాలా మీరు?"

ఆవిడ గారిదీ న్యాయంగానే కనిపిస్తోంది. ఎవరికి వారిది రైటు ఈ రోజుల్లో. అదే ఈ నాటి పెద్ద జోక్! అందరిదీ కరెక్టయితే తప్పెవరిది మరి?!

"నీ తప్పొప్పుకోవుగా ఏనాడూ." నోట్లోనే గొణుక్కున్నాడు, ముందు గదిలో ఒక మూల చెప్పులు విడుస్తూ.

"ఏమిటి మీలో మీరు అనుకుంటున్నారు?"

కాలర్ పట్టుకుని నిలదీసి అడక్కపోయినా అదే ఎఫెక్ట్ ధ్వనించింది ఆమె గొంతులో.

"ఏమీలేదు. ఒంట్లో సత్తువ లేదు. నీరసంగా ఉంది కాస్త కాఫీ నీళ్ళు నా ముఖాన కొడితే సంతోషిస్తా" అన్నాడు చంద్రం, నాలుగేళ్ళ క్రితం కొనగా సగం తీగ అల్లిక మాయం అయిన ప్లాస్టిక్ వైర్ కుర్చీలో కూర్చుంటూ.

"నిండా ముప్పై అయినా నిండలేదు. పెళ్ళయి పదేళ్ళయినా కాలేదు. ఒక్క బిడ్డనయినా కనలేదు. అప్పుడే అలా వ్రేళ్ళాడిపోతే ఎలాగండీ? మన పెళ్ళికి ముందు పరసలో కూర్చుని పెళ్ళంతా జరిపించిన మా తాతగారి వయసెంతో తెలుసా ఇప్పుడు? తొంభై! ఇంకా కర్ర గాని, కళ్ళజోడు గాని అవసరం లేకుండా తన పనులన్నీ తనే చేసుకుంటాడు! ఇప్పుడు కూడా ప్రతిరోజూ ఉదయం భగవద్గీత చదువుతాడు!" అతను అడ్డు తగలకపోతే ఇంకా ఎన్నో చెప్పును ఆవిడ తాతగారి గురించి.

"కాంతం, ఆ కథ ఆపుతావా కాసేపు? తొంభై చాలదనిపిస్తే ఇంకో తొంభై ఏళ్ళు అలాగే బ్రతకమను మీ తాతగార్ని. నా కంత ఆశ లేదు, అన్నేళ్ళు బ్రతికే ఓపికా లేదు. అర్జంటుగా కాస్త కాఫీ ప్రసాదించు."

అలా అనేసి కళ్ళు మూసుకున్న చంద్రం ఉద్దేశం ఇక నీ మాటలు వినను గాక వినను. ముందు చెప్పిన పని చూడు అని. ఆరేళ్ళుగా కాపురం చేసినందుకు ఆ మాత్రం గ్రహించిన శ్రీమతి వంటింట్లోకి జారుకుంది.

'హమ్మయ్య' అని అతను నెమ్మదిగా తనలో తాను అనుకున్న మాట గనుక ఆమెకి వినిపించి ఉంటే ఆఖరికి నేనంత కంటకురాలయిపోయానా మీకు? అని ఒంటి కాలిమీద దెబ్బలాటకి లేచును. అప్ప

తనికి కాఫీలేదు, మనకీ కథా లేదు!!

మరో పది నిముషాల్లో పొగలు, సెగలు, కమ్మని వాసన మొదలైన మంచి కాఫీ కుండాల్సిన ముఖ్య మైన లక్షణాలుగల కాఫీ తీసుకొచ్చి శ్రీవారి చేతి కిచ్చింది ఆ ఇంటావిడ.

"థాంక్స్."

"భర్తకి భార్య కాఫీ ఇస్తే థాంక్స్ అనటం అవ సరమా?" మాటేగా కాస్త అంది.

వాదనలోకి దిగటం ఇష్టం లేక ఎస్.జీ.వి లాంటి ఎమర్జెన్సీ మందు వాడే వేదు అనుకున్నాడు. "నువ్వు చాలా తెలివైన దానివి కాంతం. నీతో మాట్లాడటం చాలా కష్టం" అన్నాడు.

'నువ్ చాలా అందమైన దానివి, నువ్ మహా తెలివైనదానివి. లోకంమీద మంచితనంలో నీకు నువ్వే సాటి' అని పొగిడితే పొంగి పరవశించని స్త్రీ ఉండదు ఈ భూమిమీద. కాకపోతే అదును గా, ఎదురుగాచూసి చల్లాలి.ఉత్తమమందు. అంతేకాని ఇష్టం వచ్చినట్లు వాతావరణం చూసుకోకుండా వాడితే ఈ మందు వలన అసలు ఫలితం రాదు సరికదా ప్రయోగం బెడిసి కొడుతుంది. 'మీ నాటకాలు నా దగ్గరటండీ?' అన్నట్లు కాంక్రీటులా బిగిసిపోయి కూర్చుంటుంది ఆ స్త్రీ మూర్తి!!

చంద్రం ఆయుధం పని చేసింది.. కాంతం ముఖం నిండా నవ్వు నాట్యం చేసింది, మరు క్షణంలో.

"పాపం. చాలా అలసిపోయినట్లున్నారు. నేను బాగా విసిగించినట్లున్నాను కదూ? క్షమించండి. వచ్చే నెలలో ఎలాగయినా సరే, ఆ స్కీమ్ వాళ్ళకి డబ్బు కట్టి సైకిల్ కొనుక్కోండి. పండక్కి నాకు పట్టు చీర కొంటానన్నారు. అది మానేయండి. పట్టుచీర లేకపోతే ఇప్పుడేమీ నష్టం వచ్చి పడలేదు లెండి. నెల నెలా ఎలాగోలాగున కడదాం డబ్బు. అంతేగాని రానూపోనూ రోజుకి నాల్గు మైళ్ళు మీరు నడవడం నేను చూడలేను. ఈ పాడు వూరు పల్లె కాదు— ప్రతిదీ ప్రక్క ప్రక్కనుండటానికి. పోనీ సిటీకాదు— ఎక్కడికయినా సరే సిటీ బస్సు సౌకర్యం ఉండటానికి. అర్థం పర్థంలేని టౌన్ ఇది. ఇబ్బందులు తప్ప మరొకటి కనిపించని లాంటి టౌన్సులో."

అనూహ్యంగా భార్యామణికి తన మీద అంత సింపతీ, ప్రేమా వచ్చి పడటంతో ఉక్కిరి బిక్కిరి అయింది చంద్రానికి. వాతావరణం చల్లబడినందుకు సంతోషమూ అయింది.


"ఉత్తరాలేమైనా వచ్చాయాండీ ఇవ్వాళ??" అంది.

"అన్నట్లు రెండొచ్చాయ్. ఒకటి మీ నాన్నగారు వ్రాశారు. రెండోది నీస్నేహితురాలు రజని వ్రాసింది."

"ఏమని వ్రాశారు?"

"నేను నీ ఉత్తరాలు చదవనని తెలుసుగా కాంతం? 'ఫ్రం అడ్రస్‌చూసి, జేబులోపెట్టేశాను" అంటూ పేంటు జేబులో భద్రంగా దాచిన రెండు కవర్లు తీసి ఆమె చేతికిచ్చాడు.

"భార్యా భర్తలన్నాక ఒకరికి తెలియకూడనివి మరొకరికి ఉంటాయా? మీది మరీ చాదస్తం. నా ఉత్తరాలు చదివితే నేనే మీ అనుకోనని చెప్పినా




చదవరు మీరు."

"నో, నో నువ్వంటావని కాదు. నా ప్రేపర్స్ నాకు ముఖ్యం. అందుకోసం చదవను ఒకరి లెటర్స్‌ని. పైగానాకు చెప్పాల్సిన సంగతులుంటె ఎలాగూ నువ్వే చెబుతావ్ కదా. అంతలో ఎందుకా ఆత్రత, ఆరాటం?"

అతనిచ్చిన వివరణ ఆమె వినలేదని అతనికి కూడా తెలిసింది. ఆమె దృష్టంతా రెండు ఉత్తరాల్ని జాగ్రత్తగా తెరవడం మీదనే. కొందరు చోటు చాలకో, కక్కుర్తి తోనో ఇన్‌లాండ్ కవరు అంచులో వ్రాస్తారు. అందులోనూ ముఖ్య మైన సంగతులు అక్కడ వ్రాయటం కొందరికి వ్యసనం! కంగారుగా చింపితే ఆ భాగం, సంగతులు దక్కవని తెలుసు కాంతానికి. అందుకే ఆ జాగ్రత్త, భర్తమాట పట్టించుకోకపోవటమూను!!

చదవటంలో పుట్టింటి దగ్గర్నించి వచ్చిన ఉత్తరానికి మొదటి స్థానం ఇవ్వటంలో ఆశ్చర్యం లేదు., ఆక్షేపణా లేదు.

రెండు నిముషాల్లో చదివేసి భర్త చేతి కివ్వ బోయింది.

"నువ్వు చదివేవుగా—సంగతులు చెప్పు" అన్నాడు.

"ఇచ్చట క్షేమం, అచ్చట క్షేమం తీసేస్తే ఈ లెటర్‌లో రెండే రెండు విశేషాలు కనిపిస్తున్నాయ్."

"ఏమిటట విశేషాలు?" అలా అతను అడగాలని ఆమె కోరిక. అందుకే అడిగాడు చంద్రం. విశేషాల మీద ఆత్రతతో మాత్రం కాదు.

"పెద్దన్నయ్య బెజవాడలో ఇల్లు కొన్నాడట అరవై వేలు పెట్టి." ఎంతో సంబరంగా చెప్పింది.


"చాలా మంచి సంగతి చెప్పావ్, కాంతం. రిటై రయ్యేనాటికి స్వంత ఇల్లు కూడా అమర్చుకోక పోతే ముప్పై ఏళ్ళు ఉద్యోగం చేసిన వాడికి చిప్పే గతి. రెక్కలొచ్చి ఎగిరిపోయే పిల్లల మీద, ప్రభుత్వం ఇచ్చే అదా కానీ పింఛను మీద ఆశ పెట్టుకుంటే ముద్ద తిన్నట్లే! దాని కంటే స్వంత ఇంట్లో ఒక వాటాలో కాపురం ఉండగా, అద్దెకిచ్చే పక్క వాటా బాగా ఆదుకుంటుంది ఈ రిటైరయిన వాళ్ళని. మంచి పని చేశారు మీ అన్నయ్య. నీ జవాబులో నా కంగ్రాట్స్ అని వ్రాయి" అన్నాడు చంద్రం.

"చూడబోతే వాళ్ళందరి కంటే మీ ఆనందం ఎక్కువయిపోయేట్లుంది! మీరే ఇల్లు కొన్నంతగా మురిసిపోతున్నారు!" కాస్త వేళాకోళం, వెక్కిరింత ధ్వనించాయి కాంతం మాటల్లో.

"ఏం? నీకు ఆనందంగా లేదా?"

"ఎందుకు లేదు? ఎంత సంపాదించుకున్నా బ్యాంకుల్లో కుక్కుకోవడమే గాని తోబుట్టువుల కేమన్నా చేశాడా ఆయన గారు? ఎంత సేపూ తను, తన ముద్దుల పెళ్ళాం, తన కన్న పిల్లలూ— ఇంతే ఆయన గారి ప్రపంచం. అది దాటి మేం ఎవరం కనిపించం ఆయన గారి కళ్ళకి. చెల్లెళ్ళందరికీ ఏడాది కో చీరయినా కొని పెట్టాలని తెలియని ప్రబుద్ధుడాయన. పెళ్ళానికి మాత్రం నెలనెలా కొంటాడు. మెడ నిండా బంగారం దిగే శాడు.. మా అప్ప చెల్లెళ్ళకి ఒక్కో కాసు బంగారం అయినా కొనిపెట్టాడా? మా పిచ్చిగాని ఆయనకి మేం అంతా గుర్తున్నామా ఏమిటి?" ఎక్కడ్నించ వచ్చాయో వర్షంలా కురిశాయి ఆమె కళ్ళనించి నీళ్ళు.

చంద్రానికి అర్థం కాలేదు ఆమె ఎందు కేడు స్తోందో! అన్నగారు ఇల్లు కొనుక్కుంటే చెల్లెలు ఏడవడం, ఆక్షేపణగా మాట్లాడటం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది. అలా అని ఎవరైనా చెబితే నమ్మక పోను. ఎవరో చనిపోయినట్లు కుళ్ళి, కుళ్ళి ఏడు స్తున్న భార్యని దగ్గరకు తీసుకున్నాడు. ఆమె బుగ్గల మీదనుంచి జారుతున్న కన్నీటిని తన



మత్స్య సంహారం

చేతుల్లో ఉడిపాడు.

"ఛ. ఛ. ఏమిటిది, కాంతం? పిచ్చిదానిలా, చిన్న పిల్లలా? పెళ్ళి చేసి పంపించాక క్రొత్తలో తప్ప జీవితాంతం ఆడ పిల్లల కోరికలు తీర్చటం ఎవరి తరం చెప్పు? అలా వాళ్ళు ఏదో పెట్టాలి ఎల్ల కాలం అని ఎదురు చూడటం మనకి గౌరవమూ కాదు, న్యాయమూ కాదు. స్వంత సంసారం, బాధ్యతలు వచ్చాక ఆ బరువును మోయటంలోనే సరిపోతుంది ఏ మగాడి కయినా. తన ఇంటిని నిలబెట్టుకోవటంలోనే అలిసిపోతాడు.

అంతెందుకు? మా చెల్లెళ్ళకి నే నేమాత్రం చేస్తున్నాను, చూస్తున్నాను చెప్పు? అలా అంటే మా ఉద్యోగం చిన్నది, మీరేం చేస్తారు? పెళ్ళి చేసి పంపించారు. అదే గొప్ప—చాలు అని నన్ను వెన కేసుకొస్తావ్, నేను నీ వాడ్ని కాబట్టి. కాని ఎంత మెట్టు కంతిగాలి,కాంతం. మా అన్నయ్య పెద్ద ఉద్యోగం చేస్తున్నా ఆయనగారి కష్టాలు ఆయనకుంటాయ్. కాలేజీల్లో చదువుతున్న అబ్బాయిలూ, పెళ్ళికెదుగు తున్న అమ్మాయిలూ— ఎంత పెద్ద బరువులో తెలుసా? నిత్యం మీకు అవీ ఇవీ కొనివ్వాలంటే ఎలా సాధ్యం చెప్పు? డబ్బుతోనే ప్రేమని కొలిస్తే అంతకంటే తప్పుపని మరొకటి ఉండదు, డియర్. నిజానికి మా అన్నయ్యని నువ్వే వెనకేసుకు రావాలి, వేసుకున్నా అంటే. అలాంటిది నేను ఆయన్ని సపోర్టు చేసే పరిస్థితి కల్పించావ్..." అన్నాడు చంద్రం తన గుండె మీద తల ఆన్చి కన్నీటితో షర్టు తడిపేస్తున్న శ్రీమతితో.

అరటి పండు ఒలిచినట్లు వివరించి చెప్పాననుకున్నాడు.

"మీ కర్థం కాదులెండి" అంది లేచి మరో కుర్చీలో కూర్చుంటూ ఆమె. అతను ఆశ్చర్యపోయినా ఏమీ మాట్లాడలేదు.

ఆవిడగారు చెప్పేందానికల్లా 'తందాన తానా' అంటే గాని వస్ అవ్వదు ఏ లేడీ కూడా.

"సర్లే, ఆ సంగతి అటుంచి ఆ రెండో విషయం ఏమిటో చెప్పు" అన్నాడు చంద్రం.

"ఇది నిజానికి మనకి తెలియజేయాల్సిన విశేషం కాదనుకోండి. అయినా మా నాన్నగారికి ఏది ముఖ్యమో, కాదో తెలియదు. ఆయన ఆరోగ్యం గురించి మీరంగా వ్రాయరు. ఇంట్లో వాళ్ళ గురించి వ్రాయరు. ఎక్కడో చిన్నయ్య మరదలు ఎమ్.ఎ యూనివర్శిటీ ఫస్టులో పాసయిందట. ఈయన మురిసిపోయి ఆ అమ్మాయిని మెచ్చుకుంటూ లెటర్‌లో సగం చోటు ఆవిడగార్ని పొగడడానికి కేటాయించేశారు. అయినా వాళ్ళకి అకుల్లేను, కాని వాళ్ళకి కంచాల్లోను వడ్డించడం ఆయనకు అలవాటే లెండి ఎప్పుడూను" అంది.

"నాకు తెలిసినంత వరకూ మీ ఇంట్లో ఆడ వాళ్ళెవరూ అంత పెద్ద చదువు చదవ లేదు. ఆయనకి చదువుకున్న వాళ్ళంటే ఇష్టం. ఆయన పెద్దగా చదువుకోకపోయినా. అలాంటప్పుడు ఆ అమ్మాయిని మెచ్చుకుంటే అసూయపడతావెందుకు, కాంతం?"

"ఓహో! మీరు కూడా ఆవిడగారికి ఫేన్ అయి పోయారన్నమాట! అయినా మధ్యలో నా కెందుకట అసూయ? నా డిగ్రీ పీకి ఆవిడ కిచ్చారనా నే నేడవటానికి? అక్కడికి నాన్నగారు, మీరు విశాల హృదయులు నేను అసూయమారెమ్మనీనా?" దెబ్బలాడినట్లే మాట్లాడింది కాంతం.

"పీకటానికి నీకు డిగ్రీ లేదు కదా నో ప్రాబ్లమ్" అన్నాడు చంద్రం నవ్వుతూ.

"ఏం చేసుకుంటారండీ ఈ డిగ్రీలు? పూర్వం నాలుక గీసుకోవటానికయినా పనికొచ్చేవి. ఇప్పుడు దానికికూడా పనికిరానంత వల్చటి కాగితాలమీద దస్తూరి సాధ్యమైనంత అసహ్యంగా, వక్రంగా ఉన్న లేఖరిచేత వ్రాయించి ఇస్తున్నారిప్పుడు డిగ్రీలు. దాన్ని చూడగానే ఇన్నేళ్ళూ కష్టపడితే ఇదేనా చేతి కొచ్చింది? అనిపించేలా, ఉద్యోగం రానప్పుడు చింపిపారేద్దామని పించేలా! అయినా ఆవిడగారు రాజ్యాలు ఏలుతుందా ఏమిటి? ముదర బెండ కాయలాగా పెళ్ళి పెటాకులూ లేకుండా అలా చదువుకుపోతూ ఉంటే చివరికేం మిగులుతుంది జీవితంలో?— ఒక అర డజను డిగ్రీ కాగితాలు, నెరిసిపోయిన చెంపలు జారిపోయిన బుగ్గలు, కళ్ళకింద నల్లని గీతలు తప్ప? అలాంటి వాళ్ళకి పెళ్ళి అవదు. అంత కంటే పైకి చదివిన మగాడు దొరకడు. తక్కువ చదివిన వాడ్ని ఆవిడ పెళ్ళాడదు. అలా మిగిలిపోవాల్సిందే." గేప్ ఇస్తే శ్రీవారెక్కడ అడ్డేస్తారో అన్నట్లు నాన్—స్టాప్ ఎక్స్‌ప్రెస్‌లా చెప్పుకుపోయింది ఆవిడ.

వినటానికి అలిసిపోయిన చంద్రం వాదించే ఆలోచన పెట్టుకోలేదు.

"సర్లే. ఆ అమ్మాయి ఏమై యితే మన కెందుకు? అంత పరీక్ష పాస్ అయిన ఆ అమ్మాయికి లేదా బుర్ర తన గురించి ఆలోచించుకోవడానికి? కన్న తల్లి తండ్రులు లేరా ఏం చేయాలో, చేయాలో నిర్ణయించడానికి? మధ్యలో ఏలాపమనమెందుకు తలలు బాదుకోవాలి? పెళ్ళి కాస్త వంట ప్రయత్నం చూడు. ఏం వండుతున్నావ్ ఈ పూట వంట?" అన్నాడు చంద్రం ఎలాగయినా టాపిక్ మార్చాలని.

"ప్రొద్దున్నే చేసిన సాంబారుంది. అది వేడి చేసి కాస్త బంగాళాదుంప వేపుతాను. ఇంకా మీ కేమన్నా కావాలంటే చెప్పండి, చేస్తాను" అంది.

"అది చాల్లే. కాస్త వేడి నీళ్ళు పెట్టు స్నానానికి" అన్నాడు చంద్రం.

"అలాగే" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయిన భార్య వంక అలా చూస్తూ ఉండిపోయాడు చంద్రం. ప్రపంచంలో అసూయనంతటినీ పోగుచేసి, దానికి ఆడ దాని రూపం ఇచ్చి, నాకు భార్యగా పంపేడా ఆ సృష్టి కర్త అనుకున్నాడు మనసులో.

"పాపం, ఆ అమ్మాయి ఎంత కష్టపడి చదివిందో అంత ఫస్టుగా పాస్ కావటానికి? అన్ని వేల మందిలో మొదటిదానిగా వచ్చింది. అక్కడితో చదువు ఆపివేస్తే లెక్చరర్ అవుతుంది. కాలేజీలో. ఐ. ఎ. ఎస్. కి గనుక వెళ్ళి అదృష్టం కలిసొచ్చి పాసయితే జిల్లా కలెక్టరవుతుంది. ఆడ లెక్చరర్స్‌కీ, కలెక్టర్స్‌కి పెళ్ళిళ్ళు అవ వన్న రూలు లేదెక్కడా—కాంతం అనుకుంటున్నట్లు. వాళ్ళకి తగిన వాళ్ళని చేసుకుంటారు. కాపురాలు చేస్తున్నారు. మిగిలిన ఆడవాళ్ళ లాగే పిల్లల్ని కని తల్లులవుతున్నారు. ఇన్ని విధాల మంచిగా ఆలోచించవచ్చు ఆ అమ్మాయి భవిష్యత్తు గురించి. కాంతం అంతసేపు మాట్లాడినా అంతా చెడునే చూడగల్గింది. కాని మంచి జరగాలని ఆశించలేకపోయింది" అనుకున్నాడు చంద్రం లోలోపల. పైకి అపగల ధైర్యం ఉన్న మగవాడే. కాని భార్యతో ప్రతి చిన్న విషయం గురించీ వాదించి కొంపని నరకం చేసుకోవటం ఇష్టంలేని తెలివైన వాడు కూడా.

ఆనాటి న్యూస్ పేపర్ తీసి అందులో మునిగి పోయాడు. చెడిపోయిన రాజకీయ నాయకుల్నీ, పదవుల కోసం ప్రాకులాటలో నీతిని మరచి ప్రజల్ని మోసం చేసి ప్రవర్తిస్తున్న పోకాల్డ్ (సోకాల్డ్) దేశభక్తుల్ని ప్రతిరోజూ విడవకుండా తిడతాడు చంద్రం. అయినా సరే, ఒక్క రోజు కూడా పేపర్ చదవందే ఉండలేడు. బ్రాందీ, విస్కీల కన్నా ఎక్కువ కిక్, నిషా ఉంటాయి కాబోలు రాజకీయంలో. వినేవాడికే అంత పిచ్చి అయితే, ఇక ఆ రాజకీయ చదరంగంలో డైరక్టుగా పాల్గొనే వారికి మైకం కమ్మితే ఆశ్చర్యం ఏం ఉంది?అన్నేళ్ళనించి పాలిటిక్స్‌ని కాచి వడగట్టేవా చంద్రానికి ఒక చిన్న సత్యం తెలిసి

రాలేదు— రాజనీతిలో నీతికి స్థానం లేదని, నేతి బీర కాయలో నెయ్యి లేనట్టు.

అతను మూడో పేజీని కాచి, కషాయం కాస్తున్న సమయంలో స్నానానికి రండి అని పిల్చింది భార్యామణి. అతను కనక ఆలశ్యం చేస్తే అరగంటసేపు ఆవిడగారు సత్తాయింపు క్లాసుంటుంది— కాచిన నీళ్ళు కాస్తా చల్లారిపోయి మళ్ళీ వాటిని కాయటం అంటే కట్టెలంపు కిరసనాయిలుతగలడుతుంది—నెలకి ఎంత ఖర్చవుతుందో చూడండి. అలా లెక్కచూస్తే సంవత్సరానికి . . . అలా బుర్ర తిరిగి పోయేలా, పిచ్చెక్కి పోయేలా వంటింటి ఎకనమిక్స్ బోధించేస్తుంది! అందుకే వెంటనే టవల్ తీసుకుని బాత్‌రూమ్ లోకి ప్రయాణం అయ్యాడు న్యూస్‌పేపర్స్ రీసెర్చి స్కాలర్ చంద్రం.

* * * *


''అసలు స్నానం చేశారా లేకపోతే నీళ్ళు కాచినీ గోడ మీద దిమ్మరించి వస్తున్నారా, మీ బదులు దానికి స్నానం చేయించి?'' అయిదు నిముషాల్లో స్నానం ముగించి వస్తున్న భర్త మీద చిన్న చెణుకు విసిరింది.

''మా ఇంట్లో వాళ్ళలాగా నే నేమన్నా నెల కోసారి స్నానం చేస్తే గనక ఒక పూట అక్కడే బాత్ రూమ్‌లో కూర్చుని తోమాలి ఒళ్ళు. రెండు పూటలా చేసేవాడ్ని నా ఒంటికి మురికేం ఉంటుంది.?! అందుకే ఈ మాత్రం చాలు!'' వేళాకోళం చేయటంలో కాంతానికి ఏమీ తీసిపోడు చంద్రం.

''ఏమిటీ? మా పుట్టింట్లో జనం స్నానాలు నెల కోసారికంటే చెయ్యరనా?'' ఆమె పచ్చని బుగ్గలోకి కాస్త ఎరుపొచ్చి చేరింది. పుట్టింటి వాళ్ళమీద జోకులు, రాళ్ళు విసిరితే మాట్లాడకుండా పూరుకునే స్త్రీ ఇప్పటి వరకు పుట్టి ఉండదు; ఇక మీదట కూడా పుట్టదు. ఇది తప్పేమీ కాని సహజ లక్షణం.

''సరసాల్లేనా, దెబ్బలాటలే గాని?!'' అన్నాడు చంద్రం కాంతాన్ని గట్టిగా కౌగిట్లో బంధించి.

''ఉన్నాయి గాని ఇప్పుడు కాదు. ఇలా అంతకన్నా



మద్రాసులోని కళాసాగర్ ఆధ్వర్యంలో హైదరాబాదు లిటిల్ థియేటర్ వారు ఇటీవల ప్రదర్శించిన సాంఘిక నాటకం ''విరజాజి'' లో శ్రీ ఆర్. వి చలం, నటి శ్రీమతి ముదూరి విజయలక్ష్మి.

కాదు. ముందు మీరు వెళ్ళి బట్టలు మార్చుకోండి. మంచం మీద పెట్టేను లుంగీ, లాల్చీ. స్టౌ ఆర్పేసి నేనూ వస్తాను'' అంది.

అతను వో. కె. అంటూ వెళ్ళిపోయాడు. కాని ఆ మాటలో ఎన్నో గమకాలు పలికాయి— కొంత చలి వలన, కొంత హుషారు వలన!

''కాంతం! తెల్లలుంగీ లేదా ఉతికింది?'' పిలుపు లాంటి అతని కేకకి పడకగదిలో కొచ్చింది ఆమె.

''ఆ గళ్ళ లుంగీ నిన్ననే ఉతికి ఇస్త్రీ చేశాను. కట్టుకోండి!''

''నో, నో. ఈ రోజు తెల్లలుంగీ కావాలి.''

''ఎందుకని?'' అంది.

''ఎందుకేమిటోయ్, మాపు తెలవకుండా, ఉతక్కుండా మాసాలు తరబడి వాడడానికి ఉపయోగబడతాయి ఆ గళ్ళ లుంగీలూ పూల లుంగీలూ! అసలు తెల్ల బట్టలు వేసుకుంటే మనసు కెంత హుషారు వస్తుందో తెలుసా? ఆఖరికి సైన్సు ప్రకారం కూడా తెలుపు రంగుకు గొప్ప లక్షణా లున్నాయని చెబుతారు. జ్ఞాపకం ఉంచుకో— ఈవాల్టి నుంచి నేను తెల్ల లుంగీలు కట్టుకుంటాను— వాటితో హుషారు వస్తుంది'' అన్నాడు చంద్రం.

''అంటే మీ హుషారంతా తెల్లలుంగీ మీదనే ఆధారపడి ఉందన్న మాట!''

''నైస్ జోక్ డియర్'' అన్నాడు ఆమె చేయి పట్టుకుని నొక్కుతూ.

''మీరేమన్నా ఆకాశం నుంచి బంగారం తెచ్చి ఇమ్మన్నారు కనకనా నేను 'నో'' అనటానికి, మీ తెల్లలుంగీ కోరిక నే నెందుకు కాదనాలి?'' అంటూ గళ్ళ లుంగీ తీసి పెట్టెలో పెట్టి మల్లె పూవు లాంటి గ్లాస్కో పంచె నిచ్చిం దతనికి.

''కాంతం, నువ్వు కూడా తెల్ల చీర కట్టుకో.''


''ఇదేమిటి ఈ వేళ ఈ తెలుపు పిచ్చి?! అయినా ఎందుకట?!'' అంది అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్టు దానిలా.


''ఎందుకంటే ఏం చెప్పను?'' అన్నాడు.

''ఇదేదో సినిమాలోంచి కాపీ కొట్టిన వాక్యంలా అనిపిస్తోంది!''

''అబ్బ! కాంతం నువ్వు మరీ అంత ప్రాక్టికల్‌గా అయిపోతే నీ ముందిక నోరుతెరవను—ఆఁ'' అన్నాడు బుంగమూతి పెడుతూ.

'సరి సరి!! మీరు ముందుగదిలోకి వెళ్ళి మీ పేపరు పెళ్ళాంతో కాలక్షేపం చేస్తుండండి. నేనంతలో చీరమార్చుకుని ఎక్కాబస్తాను అంది, దేవి గారు






భక్తుడికో పెద్ద వరం ప్రసాదించినట్లు! మగాడి వరాల్లో వేడి తగ్గే క్షణం వరకూ భార్యదేవి, భర్త భక్తుడు. అతను చల్లారేక అతగాడు దేవుడు, ఆమె భక్తురాలు. ప్రతిరోజూ ఈ పాత్రలిలా మారుతూనే ఉంటాయి—భార్యాభర్తల మధ్య ముఖ్యంగా పడక గదిలో!!

చంద్రం ముందు గదిలోకి వెళ్ళిపోయాడు బుద్ధిమంతుడిలా, చెప్పినమాట వింటే ముందు ముందు మంచి బహుమతులు లిస్తుందని!

దిన పత్రికలో మూడో పేజీ పూర్తయ్యేసరికి అప్సరసలా (కనీసం అతనికళ్ళకి)తయారయి వచ్చింది కాంతం. అతని ఆనందాన్ని అంతలోనే హరించి వేసింది ఆమె చేతిలో ఉన్న నీలం రంగు కవరు.

"ఇదేం రాసిందో చూదాం ఉండండి రజనికి ఆర్నెల్లకోసారి గుర్తొస్తాను నేను! కానటానికి ప్రాణ స్నేహితురాలే ఇది నాకు!" అంటూ మరో కుర్చీలో కూర్చుంది ఆమె.

ఆమె కళ్ళు ఉత్తరాన్ని పలకరిస్తున్నంత సేపూ అతని కళ్ళు ఆమె ముఖాన్నే చదువుతున్నాయి. "వాళ్ళాయనికి ప్రమోషనొచ్చి బ్యాంకు మేనేజర్ అయ్యాడట, అంది ఉత్తరం మడతపెడుతూ, నిట్టూరుస్తూ.

"చిన్న వయసులో ఆఫీసర్ అయ్యాడంటే మంచి భవిష్యత్తు ఉంటుందతనికి. త్వరత్వరగా బ్యాంకు పరీక్షలు పాసయిఉంటాడు. కష్టపడే వా డెక్కడైనా పైకి అవుతాడులే. అభిరికె అడుక్కునే బిచ్చగాడు కూడా పొద్దస్తమానం వూరంతా తిరగకపోతే కోరి విండదు" అన్నాడు చంద్రం.

"ఆఁ, పదవి రాగానే సరిపోయిందేమిటి లెండి, ఎంత బాధ్యత? రేపేదన్నా అవకతవకలు జరిగితే శ్రీకృష్ణజన్మస్థానం ఎలా ఉంటుందో చూపిస్తారు. మనం అనుకునే ప్రతి మంచిలోనూ ఒక చెడూ, ప్రతి చెడులోనూ ఒక మంచి కల్సిఉంటాయండి. అయినా ఎంతొస్తే ఏం లాభంలెండి? రోజూ బుడ్డి మీదనే గాని మంచం మీద నిద్రపట్టదట ఆయనకి! పెట్లో అస్తమానం సిగరెట్టు అమరదీపంలా అలా వెలుగుతూనే ఉండాలట! ఈ పాటికి ఒక పూసిరి తిత్తి, సగం గుండెకాయ హరించుకు పోయే ఉంటాయి. అలాంటివాళ్ళు ఎన్ని ప్రమోషన్లు వచ్చేదాకా బ్రతుకుతారేమిటి? దాని జీవితం అలా పాడయిపోయిందనే నా బాధ" అంది కాంతం.

ఆమె మాటలు విన్నాక అతనికో అనుమానం వచ్చింది. రజనికి తన భార్యామణి ప్రాణ స్నేహితురాలా? లేక ఆగర్భ శత్రువా అని! హాలా హలానికి మూడు ముళ్ళు వేశానా నేను అనుకున్నాడు తనలో తాను. జాలిపడుతున్నట్లు నటిస్తూ అసూయను కక్కుతున్న తన అర్ధాంగిని మార్చటం ఎవరి వల్లా కాదని తెలుసుకున్నాడు.

"కాంతం, ఆకలిగా ఉంది. భోంచేద్దాం పద!! అంటూ వంటింట్లోకి దారి తీశాడు. అతని కూడా ఆమె వెళ్ళక తప్పలేదు.

"రోజు రోజుకి చిన్న పిల్లాడి తిండిలా తయారవుతూంది మీరు భోంచేయటం. నా వంట నచ్చటం లేదా?" భోజనం దగ్గర కూర్చున్న మూడో నిముషంలో పెరుగు వడ్డించుకుంటున్న భర్తను చూసి అంది.

"అయిదేళ్ళుగా తింటూంటే అమాంతంగా ఈ ఏడాది నీ వంట నచ్చటం మానేస్తుందా?" అన్నాడు.

"తను గనుక 'మనసు బాగోలేదు' అని చెబితే మళ్ళీ 'ఏం? ఎందుకు బాగాలేదు? నేనేం చేశాను? ఒక వేళ తెలియక ఏదయినా తప్పు చేసి (సాధారణంగా అంతా తెలిసే చేస్తారు తప్పులు) మిమ్మల్ని నొప్పిస్తే నన్ను క్షమించండి. (బైదిబై క్షమించండి అనే యీట ఎంత సులభమైన పని మరొకటిలేదు ఈ రోజుల్లో. ఒకనాడు ఆ మాట అనాలంటే తల తీసేసినంత బాధపడేవారు జనం!!!)' అంటూ తెల్లవార్లూ నిద్ర పోనివ్వదు భార్యామణి అని అతనికి తెలుసు!

"అన్నట్టు మన ఇంటిగలవాళ్ళబ్బాయి ఇనప్పెట్టిలోంచి డబ్బు కాజేసి ఎక్కడికో పారిపోయాడట."


"అయ్యో, పాపం!"

"పాపం ఏం ఉంది లెండి ఇన్ని అద్దె కొంపలమీద మనలాంటి వాళ్ళందరి దగ్గర నెలనెలా అన్యాయంగా గుంజుకుంటున్నాడు. పాపిష్టి సొమ్ము అట్లాపోవాల్సిందే లెండి" అంది కాంతం కసిగా.

"నీ అంత అన్యాయంగా మాట్లాడక, కాంతం. రేపు నీ ఇల్లు అద్దెకిచ్చి, నువ్వు ఇంటిగలావిడ అయ్యే వరకూ నీకు అర్థం కాదు, ఇళ్ళు అద్దెకివ్వటంలో బాధలు. ఇల్లు కట్టడానికి ఖర్చుచేసే డబ్బు మీద వడ్డీ, ఇంటిపన్ను, మరమ్మత్తులు, రోజురోజుకీ ముసలిదయిపోయి ఒక నాటికి కూలిపోయే ఇల్లు గతి లెక్కలుకడితే ఇళ్ళు కట్టి అద్దెకివ్వటం, ఉన్న డబ్బంతా తగలేసి గోడలు లేపటం అంత బుద్ధి తక్కువ పని మరొకటి ఉండదని అర్థం అవుతుంది. నువ్ నెల నెలా ఇచ్చే అద్దె గురించే నీ ఆలోచన గాని అవతలి వ్యక్తి బాధల గురించి ఆలోచించటం లేదు నువ్వు. అందుకే ఆయనికి కష్టం వచ్చినా సానుభూతి చూపించలేకపోతున్నావ్." అలా అనేసి చెయ్యి కడుక్కుంటున్న భర్త వేపు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది భోంచేయడం మానేసి, ఆ ఇల్లాలు.

"ఏమండీ, నాకో చిన్న అనుమానం."

"ఏమిటది?" అన లేతడను. అప్పటున్న ప్రశ్నార్థకంగా చూశాడు భార్య ముఖంలోకి.



“లోకం మీద మీ అంత వెర్రిబాగులోళ్ళు మరొకరుంటారంటారా?” అంది.

“నీ గురించి నేనూ అలాగే అనుకుంటున్నాను.” అనేసి లేచి పడకగది లోకి వెళ్ళిపోయాడు చంద్రం. అతని బుర్ర బాగా వేడెక్కిపోయింది. ప్రాణం విసిగిపోయింది భార్య ధోరణితో. కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

వంటిల్లంతా సర్ది నూరో పది నిముషాల్లో కాంతం వచ్చింది భర్త దగ్గరికి.

“నాకు చోటు లేదా, నాటా లేదా ఈ పక్కమీద” అంటూ కొంటెగా ప్రారంభించింది సంభాషణ.

అతను మాట్లాడకుండా గోడ ప్రక్కకు జరిగాడు. పెద్ద దీపం ఆర్పేసి, బెడ్‌లైట్ వేసింది. పక్కలో సగం ఆక్రమించుకుంది.

“ఏమండీ, అప్పుడే నిద్రపోతున్నారా?”

“లేదు.”

“చెప్పటం మరిచిపోయాను మీకు.”

“ఇప్పుడు చెబుతున్నావ్‌గా—ఇంకెప్పుడు మరిచిపోయావ్.”

“ఇంకా ముందుగా చెప్పడం మరిచిపోయాను.”

“అంత అర్జంటుగా చెప్పకపోతే కొంపలు తగులడిపోయే సంగతులేమిటో?” అన్నాడు అడిగి తెలుసుకోవాలనే ఆసక్తి అతనికి లేకపోయినా, చెప్పి తీరాలన్న ఆవిడగారి ఆరాటాన్ని తృప్తిపరచటానికి.

“మనింటి కెదురుగా కొత్తగా వచ్చిన మ్యాటర్ వాళ్ళు లేరూ? ఈ మధ్యాహ్నం ఒంటి గంటకి ఆవిడకు కడుపులో పోటు వచ్చిందట. సాయంత్రానికి ఆర్నెల్ల కడుపు కాస్తా పోయిందట, హాస్పిటల్లో. అలాగే అవ్వాల్లెండి. లేకపోతే మాకేకదా స్కూటర్ ఉందని ఒకటే ఎడిసిపాటు! మా ఆయనే కదా ఆఫీసర్ అని ఎంత టెక్కు ఆవిడగారికి! కాస్త తెల్లతోలుంది కదా అని ఒకటే గర్వం పెద్ద అందగత్తెనని. వాళ్ళిద్దరికీ కళ్ళు మూసుకుపోయి ప్రపంచం అంతా తామే అయినట్లు ఒకటే వికవికలూ పకపకలూను. రాత్రి పన్నెండు వరకూ. ఈ సారి బాగా బుద్ధి వస్తుంది లెండి. . . .” ఇంకా ఎన్ని అనునో గాని లేచి తీక్షణంగా తన ముఖంలోకి చూస్తూ నిప్పులు కురిపిస్తున్న భర్తని చూసి ఆగిపోయింది ఆ ఇల్లాలు.

ఆఫీసు నించి వచ్చిన దగ్గరనుంచీ ఓపిగ్గా వింటున్న చంద్రం ఈసారి ఆగలేకపోయాడు. భార్యలో రగులుతున్న భయంకరమైన అసూయాజ్వాల్ని భరించలేకపోయాడిక. ఆమె ధోరణినిక సహించలేకపోయాడు.

“కాంతం, పాపం కలిసి కాపురం చేయాలంటే నేను చెబుతున్న మాటల్ని జాగ్రత్తగా విని, ఒంటబట్టించుకో. నువ్వు అసూయకు ప్రతిరూపం అయిపోయావ్. ఆఖరికి తల్లి కావలసిన ఒక ఆడప్రాణి కొద్దిగో దురదృష్టవశాత్తు ఆ వరానికి దూరం అయిందంటే ప్రాణం లేని రాళ్ళు సైతం చలించి కన్నీళ్ళు కార్చాలే! అలాంటిది నువ్వెందుకింత క్రూరంగా మాట్లాడుతున్నావ్? ఎవరికి ఏంచి జరిగినా ఓర్వలేని స్థితి కొచ్చావ్ చివరికి నువ్వు. ప్రతి వారికీ చెడు కోరేలా ఎందుకు తయారయ్యావ్? నువ్వు మాట్లాడే దాంట్లో వందకి వంద శాతం పూరివాళ్ళ గురించే—తెలుసా? ఒకరి గొడవలు నీకెందుకు చెప్పు?” ఒక్కసారిగా విరుచుకుపడిన భర్తని చూస్తూ మాట లేకుండా ఉండిపోయింది కాంతం.

“ఒకరికి మంచి జరిగితే సంతోషించి వాళ్ళతో పాటు ఆనందాన్ని పంచుకోవాలి. చెడు జరిగితే జాలిపడి, చేతనైతే సహాయం చేసి ఆదుకోవాలి. అంతేగాని ప్రతివాళ్ళని గాదా అంతగా అసూయపడి, ఏం సాధించగలవు నువ్వు? అది ఇంకా నీ అసంతృప్తిని, నిరుత్సాహాన్ని, నీరసాన్ని పెంచుతుందే గానీ, నిన్నే విధంగానూ ఆదుకోదు. ఇది ఆరోగ్యానికిక్కూడా మంచిది కాదు. ఇంకెప్పుడూ నా చేత ఇలా చెప్పించుకునే పరిస్థితి కల్పించకు” అనేసి ‘ఈ కార్యక్రమం ఇంతటితో సమాప్తం’ అన్నట్లు గోడవైపు తిరిగి కళ్ళు మూసుకున్నాడు చంద్రం. ఈ సమయంలో గాంతంకంటే గోడనయం అన్నట్లు. వెరీ ఇండీసెంట్! అన్ని రాత్రులూ అటు తిరిగి పడుకోడు చంద్రం! పాపం, తెల్లపంచె, తెల్లచీర తెల్లముఖాలు వేశాయి.

“ఈయన కేం చెప్పినా అర్థం కాదు. బొత్తిగా అమాయకపు మొగుడు దొరికాడు నాకు. పోనీ చెబుదామన్నా అర్థం చేసుకోడు. తలకి పట్టించుకోడు. ఈయనకు చెప్పటం కంటే నాతో నేను మాట్లాడుకోవడం నయం” అనుకుంది కాంతం మనసులో. భర్త చేసిన ఉపదేశం పీసమెత్తయినా ఒంటపట్టించుకోని శ్రీమతి తిరిగి తన మామూలు ధోరణిలోకి, తలపుల్లోకి జారిపోయింది. తనలోని అసూయాజ్వాలకి వేలరకం మానెతో దాహం తీర్చసాగింది.

అట్లా అసూయాచితిలో నిలువునా కాలి బూడిదయిపోతున్న భార్య, తన పక్కనే పడుకున్నా సరే, ఆయనగారి ఒంటికి కాస్తయినా వేడి తగల్లేదు! చెడు తలవని అతని మనసే అతనికి సాటిలేని రక్షణ. ఆమెని రక్షించడం అతని వల్ల కావివని. అగ్నిసాక్షిగా పెళ్ళాడినా, మనఃస్ఫూర్తిగా ప్రేమించినా, ఆ మంటల్నించి ఆమెని ఆదుకోనటం అతని తరం కాదు.

అసూయ కన్నా హాలాహలం లేదు. ఈ లోకంలో నూటికి తొంభై మంది ఆ దావానలంలో మలమలమాడి మసయిపోతున్నవాళ్ళే. దాన్నించి బయటపడే మార్గం అతి సులభం. మనసులోకి ఏ క్షణాన్నా ఒకరి గురించి చెడు ఆలోచనల్ని రానివ్వకపోతే సరిపోతుంది. కాని ఇది అలాంటి జీవులకు అతికష్టం, అయిష్టం. ఎందుకంటే వాళ్ళ ఆత్మలకి, ఆహారమే ఆ అసూయ! వాళ్ళ దుష్టచింతనకి శిక్ష ఎక్కడో నరకంలో కాదు, ఇక్కడే. వారికి చితి చచ్చిన తరవాత కాష్టంలో కాదు, నిత్యం వాళ్ళ గుండెల్లోనే. బ్రతికుండగానే బూడిద వీళ్ళ బ్రతుకులు. వాళ్ళు ‘హాయిగా ఉంది’ అనుకుంటూ చలికాగుతున్న ఆ అసూయా జ్వాలలు నిజానికి ‘చలిమంటలు’ కావు; వాళ్ళని నిలువునా దహిస్తున్న దావానలాలు. చూడగలిగితే మనకెదురయ్యే వారిలో చాలా మంది గుండెల్లో వారిని దహిస్తూ కనిపిస్తాయి ఈ ‘చితిమంటలు.’ ✱

## కీలక పాత్ర

ఒక కుటుంబాన్ని తరింప చేసేది నాశనం చేసేది స్త్రీయే. ఏ కుటుంబం భవిష్యత్తు అయినా ఆమె చేతుల్లోనే ఉంది.

— అమిల్

## ప్రజ్ఞ

ఈ లోకంలో మేధావులకన్న అవివేకులే ఎక్కువ. ఆ మేధావుల్లోను ప్రజ్ఞ కన్న అజ్ఞానమే ఎక్కువ

— చంఫోర్ట్

## నిన్న - నేడు

వేలాది గోపికలు
ఒక్కడే కృష్ణుడు మొన్న
వందలాది భామలు
తానొక్కడే నిజాం నిన్న.

- ఎల్లోరా

